
# అభివృద్ధి చేశాం...ఓటడుగుతున్నాం..

- కాంగ్రెసోళ్లు వస్తే కరెంటు పోతది..
- మంచిర్యాల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దివాకర్‌రావు
- పలుగ్రామాల్లో ఇంటింటా ప్రచారం...



దండేపల్లి : నాగసముద్రంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

దండేపల్లి, నవంబర్21 : బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి చేశాం..అందుకే మీ ముందుకు వచ్చి ఓట్లు అడుగుతున్నాం..అని మంచిర్యాల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. దండేపల్లి మండలంలోని నాగసముద్రం, మాకులపేట, గుడిరేవు, వెల్గనూర్, నంబాల గ్రామంలో మంగళవారం ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత బీఆర్ఎస్ సర్కారుదే అన్నారు. సంక్షేమ పథకాలతో పాటు గ్రామాలను కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. మరోసారి మీరు ఆశీర్వదిస్తే గ్యాస్ సిలిండర్ రూ.400కే ఇస్తామని, గృహలక్ష్మి పథకం కింద నిరుపేదలకు నెలనెలా రూ.3వేల పింఛన్ అందిస్తామన్నారు. ఎన్నికల ముందు కల్లబొల్లి మాటలు చెప్పే నాయకులను చూసి మోసపోవద్దన్నారు. కాంగ్రెస్ గెలిస్తే ఉన్న కరెంటు పోతుందన్నారు. 3గంటల కరెంటు అంటున్న కాంగ్రెస్‌ను తరిమి కొట్టాలన్నారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగయ్య, రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, యూత్ నాయకులు, నాయకులు పాల్గొన్నారు.

**అభివృద్ధి చేసిన వారిని గెలిపించండి**
**- ఎమ్మెల్యే సతీమణి రాజకుమారి**

మంచిర్యాలటౌన్, నవంబర్ 21: తొమ్మిదేళ్లలో మంచిర్యాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే దివాకర్‌రావునే మరోమారు గెలిపించాలని ఆయన సతీమణి రాజకుమారి ఓటర్లను కోరారు. మంగళవారం మంచిర్యాల పట్టణంలోని పాతమంచిర్యాలలో ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ ఓటు అభ్యర్థించారు. తెలంగాణ వచ్చాకే మంచిర్యాల జిల్లాగా ఏర్పడిందని, కొత్త జిల్లాగా ఏర్పడిన మంచిర్యాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే అహర్నిశలు కృషిచేశారని గుర్తు చేశారు. మరోమారు అవకాశం ఇస్తే ఈ నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తారని అన్నారు. ఆమె వెంట మున్సిపల్ కౌన్సిలర్లు బొలిశెట్టి సునీత, వంగపల్లి అనిత, మాజీ కౌన్సిలర్ కమల, తదితరులున్నారు.

**బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం..**


మంచిర్యాల టౌన్ : అశోక్‌రోడ్‌లో ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ బోరిగం శ్రీనివాస్

మంచిర్యాలటౌన్, నవంబర్ 21: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మంచిర్యాల మున్సిపల్ 16వ వార్డు కౌన్సిలర్ బోరిగం శ్రీనివాస్ అన్నారు. బీఆర్ఎస్ మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు గెలుపును కోరుతూ మంగళవారం మంచిర్యాలలోని అశోక్‌రోడ్‌లో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. తెలంగాణ రాకముందు, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన అభివృద్ధిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఒకసారి పోల్చి చూసుకోవాలని సూచించారు. మీ కళ్లముందు కనపడుతున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు యూత్ ప్రెసిడెంట్ రగళ్ల గోపి, మహిళా అధ్యక్షురాలు సమ్మెల అర్చన, కోలేటి నగేశ్, సీతారాం, హలీం, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాలను నిర్వహించారు. దివాకర్‌రావుకు మద్దతుగా కారు గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు.

**నస్పూర్‌లో బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం**


సీసీసీ నస్పూర్ : 22వ వార్డులో వృద్ధురాలికి మ్యానిఫెస్టో పత్రం అందజేస్తున్న నాయకులు

సీసీసీ నస్పూర్, నవంబర్ 21: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో బీఆర్ఎస్ నాయకులు గౌస్, గర్శె భీమయ్య ఆధ్వర్యంలో న్యూరెడ్డికాలనీ, వినూత్న కాలనీల్లో ఇంటింటికీ తిరిగి బీఆర్ఎస్‌కు మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. 11వ వార్డులో కౌన్సిలర్ జబీన్ హైమద్ ఆధ్వర్యంలో జగదాంబ కాలనీ, హనుమాన్ నగర్, ఎస్ఎల్ఆర్ కాలనీల్లో ప్రచారంచేశారు. 22, 25 వార్డుల్లో కౌన్సిలర్లు వంగ తిరుపతి, కుర్మిళ్ల అన్నపూర్ణ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. బీఆర్ఎస్ పార్టీ గెలిస్తేనే నస్పూర్ పట్టణం మరింత అభివృద్ధి జరుగుతుందని నాయకులు తెలిపారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో నాయకులు పానుగంటి సత్తయ్య, ఎంబడి సమ్మయ్య, మేడం తిరుపతి, గర్శె రామస్వామి, పెద్దపల్లి వెంకటేశ్వర్లు, నూనె సుధాకర్, మాడుగుల స్వామిదాస్, చెరుకు శంకర్, అక్కల పోషం, మాడుగుల కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌కు ఓటేయండి.. సంక్షేమ పథకాలు అందుకోండి**
**-బీఆర్ఎస్ నేత నడిపెల్లి విజిత్‌రావు, చైర్మన్ ప్రభాకర్**

బీఆర్ఎస్‌కు ఓటు వేయండి.. సంక్షేమ పథకాలను అందుకోండని నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ అన్నారు. మంగళవారం సాయంత్రం సీసీసీ నస్పూర్ వారసంతలో ప్రచారసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారసంత ఏర్పాటు కోసం దివాకర్‌రావు ఎంతో కృషి చేసినట్లు చెప్పారు. వారసంత స్థలం విషయంలో నెలకొన్న వివాదంలో వ్యాపారస్తులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉండి పోరాడినట్లు గుర్తు చేశారు. వ్యాపారుల కోసం రూ.7.20 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నస్పూర్ మున్సిపాలిటీ కొత్తగా ఏర్పాటు అయినప్పటికీ ఇప్పటి వరకు దాదాపు రూ.135 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. వారసంత వ్యాపారులకు అండగా నిలిచిన బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. పొరపాటున ఇతర పార్టీలకు ఓటు వేస్తే వారసంత స్థలం కబ్జాకు గురై వ్యాపారులంతా రోడ్డునపడుతారని అన్నారు. ఈ సందర్భంగా వారు బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ప్రవేశపెట్టిన పథకాలను వ్యాపారస్తులకు వివరించారు. ఈ ప్రచార సభలో వారసంత వ్యాపారుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఏనుగు రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు వంగ తిరుపతి, బండి పద్మ, కుర్మిళ్ల అన్నపూర్ణ, టీబీజీకేఎస్ నాయకులు ఢీకొండ అన్నయ్య, కాశీరావు, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్


లక్షెట్టిపేట : వెంకట్రావుపేటలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సీహెచ్.దుర్గాప్రసాద్

లక్షెట్టిపేట, నవంబర్ 21: రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సీహెచ్.దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో మంగళవారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈడీ మాట్లాడుతూ దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

**ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో కొనుగోళ్లు**

మంచిర్యాల అర్బన్, నవంబర్ 21 : జిల్లా కలెక్టర్ సంతోష్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ ఏర్పాటు చేసిన ప్రత్యేకాధికారులు కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ నాయకులు కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాలకు హాజరు కావడం లేదు. దీనితో ప్రత్యేకాధికారులు మండలాల్లోని పీపీసీలను తిరుగుతూ కేంద్రాలకు ధాన్యం ఎంత మేర వచ్చిందో పరిశీలిస్తున్నారు. అలాగే ఇంత వరకు ప్రారంభం కాని సెంటర్లను దగ్గరుండి ప్రారంభిస్తున్నారు. ప్యాడీ కొనుగోలు కేంద్రాలకు రావడంతో మంగళ వారం లక్షెట్టిపేట మండలాన్ని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గా ప్రసాద్, జిల్లా వయోజన విద్యా అధికారి ఏ పురుషోత్తంలు, దండేపల్లి మండలాన్ని జిల్లా ఉపాధి అధికారి కే వెంకట రమణ, జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేం కుమార్, జైపూర్ మండలాన్ని జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ గడం గోపాల్‌లు తిరిగి పరిశీలించారు. ఆరిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని, తాగునీరు, మంచినీటి తదితర వసతులు కల్పించాలని కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు.

## బీఆర్ఎస్‌కు మద్దతుగా సినీ నటుల ప్రచారం


జన్నారంలో ప్రచారం చేస్తున్న సినీ నటులు, బీఆర్ఎస్ నాయకులు

జన్నారం, నవంబర్ 21 : ఖానాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్యా జాన్సన్‌నాయక్‌కు మద్దతుగా హైదరాబాద్‌కు చెందిని యాక్టర్లు హీరో అప్సర్ అజాద్, విలన్ విజయగంగారాజు( యజ్ఞం ఫేమ్)తో పాటు మరికొంతమంది ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నవంబర్ 30 తేదిన జరిగే శాసన సభ ఎన్నికల్లో భూక్యా జాన్సన్‌నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై బాలరాజుగౌడ్, నిర్మాత రాజశేఖర్, ఎంపీపీ మాదాడి సరోజన, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సిటిమల భరత్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్‌అలీఖాన్, ఫజల్‌ఖాన్, వైస్ ఎంపీపీ సుతారి వినయ్, ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్, వొలాల నర్సగౌడ్, మల్లయ్య, శంకర్, నాసాని రాజన్న పాల్గొన్నారు.

**రేండ్లగూడలో ఇంటింటా ప్రచారం చేసిన బీఆర్ఎస్**


రేండ్లగూడ గ్రామంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న సర్పంచ్ ఆశారాజ్

జన్నారం, నవంబర్ 21 :మండలంలోని రేండ్లగూడలో గ్రామ సర్పంచ్ నెమలికొండ ఆశారాజ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి భుక్యా జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారాన్ని కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ముడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేయాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీఆర్టీయూ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 21 : పీఆర్టీయూ తెలంగాణ జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పర్వతి సత్యనారాయణ సమక్షంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ధరణికోట వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా సూరినేని గంగాధర్, అసోసియేట్ అధ్యక్షులుగా ఆర్ కే సాంబయ్య, ఏ సాగర్, మహిళా అసోసియేట్ అధ్యక్షులుగా ఆర్ రాధాలత, కే విజయలక్ష్మి, ఉపాధ్యక్షులుగా రామ్మోహన్ రావు, బోయిని శ్రీనివాస్, పర్వతి శ్రీనివాస్, సత్యనారాయణ రావు, మహిళా ఉపాధ్యక్షులుగా సరోజ, జ్యోతి, కార్యదర్శులుగా దుర్గం సహదేవ్, వెంకటేశ్, మహిళా కార్యదర్శులుగా వైలెట్ మేరీ, సుజాత ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సంగర్స్ రవికాంతరావు, పరిశీలకులుగా అరకాల కుమార్ వ్యవహరించారు. అనంతరం నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కమిటీ రెండేండ్ల పాటు కొనసాగనుంది.

## మదర్ థెరిసా పాఠశాలపై విచారణ

దండేపల్లి, నవంబర్21: దండేపల్లి మండలంలోని కన్నెపల్లిలో గల మదర్ థెరిసా పాఠశాలపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. ఎంఈవో కే రవీందర్, జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు సత్యమూర్తి, చౌదరి ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమక్షంలో విచారణ చేపట్టారు. ఎంఈవో రవీందర్ మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం తీరు సరిగ్గా లేదని చాలా సందర్భాల్లో ఫిర్యాదులు వస్తున్నాయని వారికి తెలియజేశారు. ప్రశ్నించిన విద్యార్థుల తల్లిదండ్రులపై కోపంతో విద్యార్థులను కావాలనే ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పలు అంశాలపై వారిని వివరణ కోరి తదుపరి పూర్తిస్థాయి నివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి అందజేస్తామన్నారు.